క్లుప్తంగా

బదిలీపై వెళ్తున్న కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ కార్మికులు

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా పని చేసి బదిలీపై సిరిసిల్ల వెళ్తున్న కమిషనర్ ఎండీ అయాజ్‌ను మున్సిపల్ సిబ్బంది, కార్మికులు మంగళవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు తప్పవని, తన హయాంలో కోరుట్ల పట్టణం కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అవార్డులు పొందటం సంతృప్తినిచ్చిందని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలి



ఫాగింగ్ యంత్రం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని వర్షకొండ, డబ్బా గ్రామాల్లో పారిశుధ్య పనులను, నర్సరీని వర్మి కంపోస్టు షెడ్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలతో మురికి కాలువల్లో మురికి పేరుకపోతోందని, వెంటనే మురికి కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణకు మందులను స్ప్రే చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామంలో నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ ధరల వివరాలు లేకుంటే కఠినచర్యలు



స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏవో జ్యోతి

కొండగట్టు: ఎరువుల దుకాణాల్లో స్టాక్ వివరాలు నమోదు చేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కొడిమ్యాల ఏవో జ్యోతి హెచ్చరించారు. మంగళవారం కొడిమ్యాల మండల కేంద్రంలోని విత్తన ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌తో పాటు ధరల వివరాలు రైతులకు తెలిసే విధంగా తప్పకుండా బోర్డుపై ప్రదర్శించాలన్నారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం దుకాణాలలో ఉన్న ఎరువుల శాంపిల్లను సేకరించుకొని ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. రైతులు ఎరువులు కొనేందుకు వచ్చిన సమయంలో ఆధార్ కార్డ్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

పశుసంపదను పరిరక్షించుకోవాలి



నట్టల నివారణ మందు వేస్తున్న జెడ్పీటీసీ

బుగ్గారం: పశుసంపదను పరిరక్షించుకుని పల్లెల్లో పాడిని అభివృద్ధి చేసుకోవాలని జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ అన్నారు. వెటర్నరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం మద్దునూర్‌లో పశువులకు నట్టల నివారణ మందును పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశుసంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల తిరుపతి,ఎంపీటీసీ గాలిపెల్లి మహేశ్,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.సునీల్ జనగామ, ఎల్‌ఎస్‌ఏలు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

వెల్గటూర్: ఎండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారత టీం సభ్యులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాలబాలికలకు బాల్యవివాహాల గురించి, సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్ గురించి, బేటీ బచావో - బేటీ పడావో స్కీం గురించి, టోల్ ఫ్రీ నెంబర్ గురించి వివరించారు. ఫోక్సో చట్టం గురించి, మొబైల్ ఫోన్ వినియోగం వల్ల లాభ, నష్టాలు, పిల్లల్లో వ్యక్తిగత వికాసం పెంపు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ అశ్విని, టీం మెంబర్స్ గౌతమి, హేమశ్రీ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కట్టెల వంతెన.. పుట్టెడు కష్టాలు

- చిన్నవాగు అవతల పొలాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నవాగు
- 500 ఎకరాల్లో మొదలుకాని నాట్లు
- ఆందోళనలో చెర్లపల్లి, రఖ్బా రైతులు



పొలాలకు వెళ్లేందుకు చిన్నవాగుపై ఏర్పాటు చేసిన వంతెన

సారంగాపూర్: భారీ వర్షాలతో చెర్లపల్లితో పాటు శివారు గ్రామం రఖ్బా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రోళ్ల వాగు కారణంగా రైతులు తమ పొలాల్లో నాట్లు వేయడానికి నానా పాట్లు పడుతున్నారు. పొలాల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నా, తమ భూముల్లో తామే నాటు వేసుకోలేని పరిస్థితి నెలకొంది. రోళ్లవాగు నుంచి చెర్లపల్లి, రఖ్బా వైపు భారీ వస్తున్న వరదలతో రైతులకు ఏమి పాలుపోలేని స్థితిలో నెలకొంది. తమ పొలాలకు వెళ్లడానికి వాగుపై కట్టెలతో వంతెన ఏర్పాటు చేసుకున్నారు.

రోళ్లవాగుతోనే రైతులకు కష్టాలు..

బీర్‌పూర్ మండలం చెర్లపల్లి, రఖ్బా గ్రామాల్లోని రైతులకు గతంలో బుగ్గచెరువు ద్వారా పంటలు సాగయ్యేవి. ఆరేళ్ల క్రితం రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునీకరణలో బుగ్గచెరువును రోళ్లవాగులో కలిపేశారు. ప్రస్తుతం ఈ గ్రామ రైతులకు రోళ్లవాగు ప్రాజెక్టు మొదటి తూము నుంచి నీరు పంట పొలాలకు అందుతుంది. చెర్లపల్లి, రఖ్బా రైతులకు రోళ్లవాగు దిగువన రాగల్ల శివారు, బుగ్గభీమన్న దేవుని శివారుల్లో దాదాపు 500 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూముల్లో రైతులు వరి వేస్తున్నారు. కాగా మొన్నటి వర్షాలకు రోళ్లవాగు ప్రాజెక్టు నుంచి మొదటి తూము ద్వారా చెర్లపల్లి వైపు భారీగా నీటి ప్రవాహం వస్తుండడంతో వాగు దాటలేక పోతున్నారు.

500 ఎకరాల్లో ప్రారంభం కాని నాట్లు..

చెర్లపల్లి, రఖ్బా రైతుల భూముల్లో ఇప్పటికీ వరినాట్లు ప్రారంభం కాలేదు. వరి నాట్లు వేయడానికి రైతులు చిన్నవాగును దాటాల్సి ఉంది. ఎగువన రోళ్లవాగు నుంచి చిన్నవాగులో ప్రస్తుతం భారీగా నీటి ప్రవాహం ఉండడంతో రైతులు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. రోళ్లవాగు ప్రాజెక్టు తూములకు షటర్లు(గేట్లు)బిగించకపోవడంతో వచ్చిన నీరు వచ్చినట్లు దిగువన పంట పొలాలను ముంచెత్తితుంది. దీంతో చెర్లపల్లి, రఖ్బా రైతులు ఇప్పటికీ నాట్లు వేయలేదు. దీంతో నార్లు ముదిరిపోతున్నాయి.

వాగుపై కట్టెలతో వంతెన

చిన్నవాగులో భారీగా నీటి ప్రవాహం ఉండడంతో వాగును దాటడానికి రఖ్బాకు చెందిన ముద్దసాని చంద్రయ్య, మరికొంత మంది రైతులు కలిసి చిన్నవాగుపై నీలగిరి కట్టెలతో వంతెన నిర్మించారు. కట్టెలతో వంతెన నిర్మిస్తుండగా ముద్దసాని చంద్రయ్య వాగులో పడి కొట్టుకుపోయి తీవ్ర గాయాలై ప్రాణాలతో బయట పడ్డాడు. కట్టెల వంతెన మీదుగా పొలాలకు వెళ్లొచ్చని, కానీ పొలాలు దున్న డానికి ట్రాక్టర్లు వెళ్లడం లేదని, భారీ ప్రవాహానికి ట్రాక్టర్లు కూడ కొట్టుకుపోయే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా చిన్నవాగుపై బ్రిడ్జి నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

వరదలో కొట్టుకుపోయా



కట్టెలతో రైతులందరం కలిసి వంతెన నిర్మాణం చేస్తుండగా, నేను కాలువలో కొట్టుకుపోయా. చాలా దూరం నీటిలో కొట్టుకుపోతుండగా రైతులు నన్ను కాపాడారు. తీవ్ర గాయాలతో బయటపడ్డాను. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మా సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– ముద్దసాని చంద్రయ్య, రైతు

మా వైపు నీటిని తగ్గించాలి



చెర్లపల్లి, రఖ్బాల వైపు రోళ్ల వాగు నుంచి భారీగా నీరు వస్తోంది. అధికారులు బీర్‌పూర్ వైపు తూముకు నీటిని పెంచితే మాకు నీరు తగ్గే అవకాశం ఉంది. రోళ్ల వాగుకు షటర్లు బిగించి భారీగా వస్తున్న నీటిని నిలువరించాలి.అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తి చేయించాలి.

– అజ్మీరా ప్రభాకర్, సర్పంచ్ చెర్లపల్లి

శాశ్వత పరిష్కారం చూపించాలి



చిన్నవాగు మీది నుంచి అవతలివైపు పొలాలకు ట్రాక్టర్లు, రైతులు, రైతు కూలీలు వెళ్లడానికి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి.. చిన్న వాగుపై వంతెన, లేదంటే పైపులతో కాజ్‌వే నిర్మించినా మాకు ఈ కష్టాలు తీరుతాయి.

– పత్తి సత్తెన్న, చెర్లపల్లి

వరద బాధితులను ఆదుకుంటాం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన కోరుట్లలో వరద తాకిడికి గురైన గంగంపేటలో ఏరియాలో ఇంటింటికీ తిరిగి నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో మాట్లాడుతూ, వరద తాకిడికి ఇండ్లు కూలిపోయిన వారికి ప్రభుత్వపరంగా గృహలక్ష్మి పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అద్దె ఇళ్లల్లో ఉండి వరదలతో సామాన్లు, కొట్టుకుపోయిన వారికి సొంత ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇప్పిస్తామన్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఫోన్ ద్వారా తెలిపి గంగంపేటలో పర్యటించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీద పవన్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షులు అన్నం అనిల్, మండల పార్టీ అధ్యక్షులు దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వరద నష్టం అంచనా వేసి నివేదించాలి

నియోజకవర్గంలో వరదతో జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాలకు తెగిపోయిన రోడ్లు, వంతెనల నష్టం అంచనాలు, పంట నష్టం అంచనాలు త్వరగా సిద్ధం చేసి రైతులకు వీలైనంత తొందరలో నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

కుల సంఘాల అభ్యున్నతికి కృషి

మెట్‌పల్లి: కుల సంఘాల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం వేంపేట, చింతలపేట, చౌలమద్ది గ్రామాలకు చెందిన పలు కుల సంఘాలకు మంజూరైన నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్‌లను ఆయా సంఘాల పెద్దలకు ఎమ్మెల్యే అందజేశారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయంలో మెట్లచిట్టాపూర్, విట్టంపేట, రాజేశ్వర్‌రావుపేట గ్రామాలకు చెందిన 61 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు.కార్యక్రమాల్లో ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

'కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో లేదు'

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో లేదని తెలంగాణ జనసమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్, గొర్రెపల్లి, కొత్తదాంరాజుపల్లి గ్రామాల్లో టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్కా కమలాకర్‌తో కలిసి ఆయన పర్యటించారు. భారీ వర్షాలకు పంటనష్టపోయిన రైతులను, దెబ్బతిన్న రోడ్లు, గండిపడ్డ చెరువులను పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగి రైతుకు తీరని ఆవేదనను మిగిల్చాయన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారంతో పాటు మోడల్ స్కూల్ రోడ్డులో హైలెవల్ వంతెన, మత్స్యకారులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజేఎస్ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు పసునూరి శ్రీనివాస్, యువజన సమితి జిల్లా నాయకుడు వన్నెల శశికుమార్, విద్యార్థి జనసమితి రాష్ట్ర కార్యదర్శి కేశపాక తరుణ్. నియోజకవర్గ కన్వీనర్ రాంపెల్లి శ్యాంకుమార్ పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ రోడ్డు పరిశీలిస్తున్న నాయకులు

తల్లిపాలే చిన్నారులకు ఆరోగ్యకరం



జగిత్యాల: చిన్నారులకు ఆహారం తినిపిస్తున్న సీడీపీవో

జగిత్యాలరూరల్/ కథలాపూర్/సారంగాపూర్/ధర్మపురి/కొండగట్టు/గొల్లపల్లి/మల్లాపూర్/మల్యాల/ రాయికల్/పెగడపల్లి: తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠమని, ప్రతీ తల్లి పిల్లలకు తాగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి, మోరపల్లి, అర్బన్ మండలం మోతె గ్రామాల్లో, కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలంలోని పలు గ్రామాల్లో, సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్, మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి మండల్లాలోని పలు గ్రామాలు, ధర్మపురి పట్టణలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు మించిన మంచి ఆహారం ఏది లేదన్నారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సారంగాపూర్: గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు డాక్టర్ ఎడమల శైలేందర్‌రెడ్డి అన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఆయన వెంట బీజేపీ బీర్‌పూర్ మండల అధ్యక్షుడు మ్యాడ జనార్దన్, ప్రధానకార్యదర్శులు ఆడెపు రమేశ్, అప్పాల జలేందర్, యువ మోర్చా అధ్యక్షుడు నరేంధర్ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చేవరకూ సమ్మె

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేవరకూ సమ్మె కొనసాగిస్తామని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీసవేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేరేళ్ల మోహన్, పంచాయతీ సిబ్బంది జిల్లాపెల్లి రమేశ్, నిరేటి రతన్, నరేశ్,గోవర్ధన్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల గోడు ప్రభుత్వానికి పట్టదా.?

మల్లాపూర్: గ్రామ పంచాయతీ ఉద్యోగులు,కార్మికుల గోడు ప్రభుత్వానికి పట్టదా అని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ అన్నారు.మల్లాపూర్ భరతమాత కూడలి వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ, కార్మికులను కేటగిరిల వారిగా హోదా కల్పించి క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు నేరేళ్ల మోహన్, మండల అధ్యక్షుడు తిప్పనవేని సుధాకర్, గడచంద శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్, తాండ్ర్యాల గ్రామాల్లో వర్షం తాకిడికి కోతకు గురైన చెరువులను రాజన్న సిరిసిల్ల జిల్లా ఈఈ అమరేందర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. కాగా చెరువులను త్వరగా మరమ్మతులు చేస్తే సాగుకు నీళ్లందుతాయని పలువురు రైతులు అధికారులను కోరారు. ఆయన వెంట డీఈ ప్రశాంత్, ఏఈ శ్రీనివాస్, రాజు, నాయకులు ఉన్నారు.

మేడిపల్లి మండలంలో..

మేడిపెల్లి మండలం కల్వకోట, బీమారం మండలం రాజలింగంపేట గ్రామాల శివారులో వర్షం తాకిడికి గండిపడిన చెరువులను నీటిపారుదలశాఖ రాజన్న సిరిసిల్ల జిల్లా ఈఈ అమరేందర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. గండి పడిన చెరువులను ఏ విధంగా మరమ్మతులు చేయాలనే ప్రతిపాదనల కోసం పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డీఈ ప్రశాంత్, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలవాలి



పార్టీలో చేరిన వారితో మంత్రి

పెగడపల్లి: ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని మంత్రి ఈశ్వర్ కోరారు. పెగడపల్లి మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన పలువురు వివిధ పార్టీల నుంచి మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరగా మంత్రి ఈశ్వర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ పథకాలు ఆకర్షించి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లారెడ్డి, వెంకన్న, బీఆర్‌ఎస్ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ ఆనందం, సభ్యులు సురేందర్‌రెడ్డి, సురేందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో సమీకృత మార్కెట్



ముస్తాబవుతున్న సమీకృత మార్కెట్

ధర్మపురి: ఏళ్లుగా ఎండకు ఎండుతూ వానకు నానుతూ రోడ్లపై కూరగాయలు, పూలు, పండ్లు ఇతర వస్తువులను అమ్ముకునే వారి కష్టాలు తీరనున్నాయి. ధర్మపురి పట్టణంలో రూ. 4 కోట్ల వ్యయంతో నిర్మించిన సమీకృత మార్కెట్ నేడు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

ఐదు మున్సిపాలిటీలకు రూ.27 కోట్లు

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో సుమారు 27 కోట్ల వ్యయంతో సమీకృత మార్కెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో ధర్మపురిలో పనులు పూర్తి చేసి నేడు ప్రారంభించనున్నారు. ఇక మిగిలిన జగిత్యాల, కోరుట్ల, మెట్‌పెల్లి పురపాలికల్లో 85 శాతం వరకు పనులయ్యాయి. రాయికల్ మున్సిపాలిటీలలో పనులు చేపడుతున్నారు. మొత్తం ఐదు మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: రైతుబాంధవుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాయికల్ మండలంలోని మైతాపూర్ గ్రామంలో రూ.45 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ, వీరాపూర్‌లో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.25 లక్షల చెక్కును ఆయన పంపిణీ చేశారు. అనంతరం రాయికల్ పట్టణంలోని ఏఎంసీ చైర్మన్‌గా మారంపల్లి రాణి నూతనంగా బాధ్యతలు చేపట్టగా ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుబాంధవుడు సీఎం కేసీఆర్ అని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఉచిత విద్యుత్, మిషన్ కాకతీయ ద్వారా లక్షల ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్ అజారోద్దీన్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఏఎంసీ చైర్మన్ మారంపల్లి రాణి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పట్టణ అధ్యక్షుడు ఇంతియాజ్, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

జగిత్యాల: విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని, ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మహిళ డిగ్రీ కళాశాల ఆవరణలో రోటరి క్లబ్, ఆపి, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటి దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేశారు. పర్యావరణపరిరక్షణలో విద్యార్థినీ, విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి నరేశ్, కమిషనర్ అనిల్‌కుమార్, డీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎస్సారెస్పీ నీటిని వెంటనే విడుదల చేయాలి

ఇబ్రహీంపట్నం: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని రైతు నాయకుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలకేంద్రంలో మాట్లాడుతూ రైతులు పొలాల్లో నార్లు పొసి నాట్లు వేసే దశలోకి వచ్చాయని నీళ్ల లేకపోతే నార్లు ముదిరిపొయి పంటల దిగుబడి తగ్గిపోతుందని వెంటనే నీటిని విడుదల చేసి రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతులు గూడ పాపన్న, పత్తిరెడ్డి నర్సరెడ్డి, కొనమ్మ చిన్న రాజన్న, రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

కోరుట్ల: పట్టణంలోని హాజీపురలో ఇటీవల మృతి చెందిన జర్నలిస్ట్ ఖాజా నసీరొద్దీన్ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు యువకులు మంగళవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో హాజీపురకు చెందిన పలువురు యువకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సత్యనారాయణ ఎంపికపై సంబరాలు

మెట్‌పల్లి: ఎరుకల సామాజిక వర్గానికి చెందిన సత్యనారాయణను ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంపై పట్టణంలో సోమవారం ఎరుకల సంఘం ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్యనగర్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. సత్యనారాయణను ఎంపిక చేసినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అంగడి పురుషోత్తం, నాయకులు పెద్ద పోచయ్య, లక్ష్మణ్, లక్ష్మీకాంతం, ధనుంజయ్, దశరథం, తిరుపతి, సునీత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయులకు టైం స్కేల్ వర్తింపజేయాలి

గొల్లపల్లి: కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన సిబ్బందికి కనీస వేతనం వర్తింపజేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదుచేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఉపాధ్యాయుల వలే కేజీబీవీ ఉపాధ్యాయులకు సెలవులు వర్తింపజేయాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజు, మండల అధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి ఉమేశ్, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన కానిస్టేబుల్

జగిత్యాలరూరల్: జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో రాజేశ్వరి అనే మహిళకు అత్యవసరంగా రక్తం అవసరముండగా జగిత్యాల ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కిరణ్ మంగళవారం రక్తదానం చేశారు.

అధిక రుసుం వసూళ్లపై ఫిర్యాదు

మెట్‌పల్లి: పట్టణంలోని బస్‌స్టేషన్‌లో ఉన్న టూవీలర్ స్టాండ్ నిర్వాహకుడు ఆర్టీసీ సంస్థ నిబంధనలు పాటించడం లేదని సింగిల్ విండో డైరెక్టర్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి సోమవారం డిపో మేనేజర్ వేదవతికి ఫిర్యాదు చేశాడు. స్టాండ్‌లో వాహనాలను పార్కింగ్ చేస్తున్న వారి నుంచి నిర్ణీత రుసుం కంటే అధికంగా వసూలు చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బ్రిడ్జి పనులను వేగవంతం చేస్తాం

రాయికల్: పట్టణంలోని మైతాపూర్, రామాజీపేట బ్రిడ్జి పనులను వేగవంతం చేస్తామని మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాస్‌తో కలిసి పనులను పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా రోడ్డు మరమ్మతులు చేశామని, అంతేకాకుండా బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తయ్యేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

కంట్లో కారం చల్లి పరారీ

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఆనంద్ నగర్‌లో నివాసముండే హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు వద్లకొండ శ్రీనివాస్ కళ్లల్లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కారం చల్లి పారిపోయారు. బాధితుడి వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో తన బట్టల షాపులో ఉండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కంట్లో కారం చల్లి పారిపోయినట్లు శ్రీనివాస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్లు సీజ్

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటి కొండాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో రోడ్లపై తిప్పుతున్న 2 కేజ్‌వీల్ ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ మంగళవారం తెలిపారు. పట్టుకున్న కేజ్‌వీల్ ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా ట్రాక్టర్ యాజమానులు రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు త్రిప్పితే పట్టుకుని కేసు నమోదు చేసి సీజ్ చేస్తామని తెలిపారు.

'గుడ్ మార్నింగ్'తో సమస్యలు పరిష్కారం

ధర్మపురి: గుడ్‌మార్నింగ్ కార్యక్రమంతో ప్రజాసమస్యలు పరిష్కరిస్తామని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నాడు. ధర్మపురి పట్టణంలో శ్రీకాంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన గుడ్‌మార్నింగ్ కార్యక్రమం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుందన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచనల మేరకు పట్టణంలోని 10 వార్డులో ప్రజల సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని, మంత్రి సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులున్నారు.